నేటి నుంచి పీఓ, ఏపీఓలకు మూడో విడుత శిక్షణ

- **కలెక్టర్ హరిచందన**

నల్లగొండ, మే 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెండో విడుత శిక్షణకు హాజరైన పీఓ, ఏపీఓలకు ఈ నెల 8, 9 తేదీల్లో మూడో విడుత శిక్షణను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి చందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు , మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడుతలుగా శిక్షణ ఉంటుందని పీఓ, ఏపీఓలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ సక్రమ నిర్వహణ, మాక్ పోలింగ్ అన్ని విషయాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

కదం తొక్కిన పట్టభద్రులు

నల్లగొండ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ**
- **పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు**

నల్లగొండ రూరల్, మే 7 : నల్లగొండ ,వరంగల్,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి మంగ శవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఉమ్మడి జిల్లాల నుంచి పట్టభద్రులు, బీఆర్ఎస్ శ్రేణులు నల్లగొండకు తరలివచ్చారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మి గార్డెన్స్ నుంచి ఐదు వందల బైకులు, భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అభివాదం తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. లక్ష్మీ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్‌జీ కళాశాల, గడియారం సెంటర్, డీఈఓ ఆఫీస్, బీటీఎస్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా బీఆర్ఎస్ శ్రేణులు,పట్టభద్రులు డీజే పాటలకు స్టెప్‌లు వేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా ముందుకు సాగారు. ర్యాలీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తాత మధు పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాల బోటనీ అధ్యాపకురాలికి డాక్టరేట్

స్వప్న

రామగిరి, మే 7: నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ అధ్యాపకులు సిరినేని స్వప్నకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు యూనివర్సిటీ సోమవారం పట్టా అందజేసింది. దాంతో ఆమెకు ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఘన్ శ్యాం, సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు. తనకు సహకరించిన కుటుంబ సభ్యులు, మిత్రులకు స్వప్న కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం స్వప్న ఓడీపై సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

అభ్యర్థుల ఖర్చు వివరాలు రెండో విడుత తనిఖీ

నల్లగొండ, మే 7 : పార్లమెంటు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చుల లెక్కను ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకుడు కల్యాణ్ కుమార్ దాస్ మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉదయాదిత్య భవన్‌లో తనిఖీ చేశారు. మొత్తం 22 మంది అభ్యర్థులకు గాను, 19 మంది అభ్యర్థులు ఈ తనిఖీకి హాజరై వారికి సంబంధించిన ఖర్చుల రిజిస్టర్లు, రికార్డులను, రిపోర్టులను సమర్పించారు. ఖర్చులకు సంబంధించి రిపోర్టులతో పాటు, ఏబీసీ ఫార్మట్లను పరిశీలించారు. అంతేకాక షాడో రిజిస్టర్‌తో సరిపోల్చి చూశారు. కార్యక్రమంలో సహాయ వ్యయ పరిశీలకులు సురేశ్, జిల్లా కోపరేటివ్ అధికారి, ఎన్నికల ఎక్సపెండిచర్ నోడల్ అధికారి కిరణ్ కుమార్ ఉన్నారు.

టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

రామగిరి మే 7: మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే టీఎస్ ఎడ్ సెట్-2024 ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈనెల 10 వరకు పొడిగించినట్లు ఆ సెట్ చైర్మన్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్ రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ 250 అపరాధ రుసుముతో ఈనెల 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు https:// edcet.tsche.ac.in లో సంప్రదించాలని కోరారు. అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మదనాచారికి నివాళి

మదనాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పెంటర్స్ యూనియన్ సభ్యులు

మిర్యాలగూడటౌన్, మే 7 పట్టణంలోని విశ్వకర్మ కార్పెంటర్ యూనియన్ కార్యాలయంలో అన్నభీమోజు మదనాచారి(ఆచారి)86వ జయంతిని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గడగోజు రామాచారి కుటుంబానికి ఆచారి ఫౌండేషన్ ద్వారా కుట్టుమిషన్‌ను అందించారు .ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కార్పెంటర్స్ సంఘం పట్టణాధ్యక్షుడు కొండోజు మల్లికార్జునచారి, ప్రధానకార్యదర్శి నర్సింగోజు రామాచారి,యూనియన్ సభ్యులు కార్పెంటర్లు పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి**
- **బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం**

గట్టుప్పల్, మే 7: బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ఓటర్లను కోరారు. మంగళవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఉపాధి హామీ కూలీలను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలంతా ఆశీర్వదించి గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అవ్వారి గీతా శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం, నాయకులు శంకరప్ప, ఆనంద్, దోర్నాల అమరేందర్, గంజి కృష్ణయ్య, పున్న కిశోర్, నారని జగన్, వెంకటేశం, పెదగని శ్రీనివాస్, పులిపాటి వెంకటేశం పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ : మండలంలోని నామాపురంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కేంద్రంలో అధికారంలోకి రావాలనే ఆశ ఉన్నదని బీఆర్ఎస్‌కు మాత్రం రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు భట్టు వెంకటేశ్,నాయకులు బాలం జంగయ్య,సింగారపు భాస్కర్, బాలం శ్రీను, భీమనపల్లి గాలయ్య, వీరమల్ల భిక్షమయ్య పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : మండలంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిట్యాల 3వ వార్డు, పిట్టంపల్లిలో ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 హామీలను అమలు చేయడంలో విఫలమైందని మళ్లీ ఆ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు అన్యాయం జరుగుతుందని తెలుపుతూ ఓట్లు అభ్యర్థించారు. చిట్యాలలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పోలేపల్లి సత్యనారాయణ, కూనూరు శంకర్, జిట్ట కృష్ణ, అశోక్, ఆవుల ఆనంద్, ఆవుల అంజి, జిట్ట శేఖర్, ఉప్పల నగేశ్, సైదులు, జోగు శ్రీకాంత్, అశోక్ రెడ్డి, జనార్దన్‌రావు, మాస శేఖర్ పాల్గొన్నారు. పిట్టంపల్లిలో ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ ఈసం బాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి, కొమురెల్లి మోహన్‌రెడ్డి, సింగిరెడ్డి జంగారెడ్డి, సామ మహేందర్‌రెడ్డి సింగిరెడ్డి గోపిరెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: క్యామ మల్లేశ్‌ను గెలించాలని కోరుతూ మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. జాలో నిగూడెం, తిరుమలరాయిని గూడెం, బండ మీదిగూడెం, ఊట్కూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, మెట్టు నగేశ్, కర్రె సైదులు, వేముల అశోక్, మహేశ్వరం వెంకన్న, మెట్టు ఉపేందర్, బడేసాబ్, బొడ్డు విజయ్ పాల్గొన్నారు.

మునుగోడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు,బూతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాంపల్లి: క్యామ మల్లేశ్‌కు మద్దతుగా మండలంలోని తిరుమలగిరిలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలా అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు , మండల అధికార ప్రతినిధి పొగుల వెంకట్‌రెడ్డి నాయకులు సపావత్ సర్దార్ నాయక్, ఎండీ సలీం, వీరమళ్ల భిక్షం, పొనుగోటి నర్సింహారావు, పగిళ్ల మల్లేశ్, దశరథ పాల్గొన్నారు.



గట్టుప్పల్ : ఎర్రకుంట చెరువులో కూలీలను ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి

మర్రిగూడ : నామాపురంలో ఓటును అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్

చిట్యాల: పిట్టంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శాలిగౌరారం: బండమీదిగూడెంలో మహిళలను కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మునుగోడు: కల్వలపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నాంపల్లి : తిరుమలగిరిలో..

తెలంగాణ ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్సే

- **బీఆర్ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ**
- **కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం**

మిర్యాలగూడ: బీఆర్ఎస్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, నాయకులు

మిర్యాలగూడ, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. పట్టణంలోని శాంతినగర్, రెడ్డికాలనీల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమాల్లో వార్డు కోఆర్డినేటర్లు అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- అడవిదేవులపల్లి : బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపును కాంక్షిస్తూ మండల కేంద్రం, బంగారికుంటతండా గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొర్ర శ్రీను నాయక్, రవి, బాలాజీ, శ్రీను, సేవా, లింగా, చిన్ననాయక్, సతీశ్, చంటి, గణేశ్, రామ, రంగా పాల్గొన్నారు.
- చందంపేట: బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ మండలంలోని పోల్యానాయక్‌తండా, ముడుదండ్ల, మూర్పునూతల, గన్నెర్లపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కేతావత్ సుశీలాశంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఇస్లావత్ సునీతాబాలవర్ధి రాజు, నాయకులు శ్రీనివాస్ గౌడ్, పొలగోని సత్యనారాయణగౌడ్, గోసుల శివ, శ్రీశైలం, శ్రీనివాస్, మురళి, యాదయ్య, నర్సింహ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.
- నేరేడుగొమ్ము మండల కేంద్రం ప్రచారంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముక్కమల బాలయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరెకంటి రాములు, వెంకటయ్య, వడ్డ్య బాలు, నాగునాయక్ పాల్గొన్నారు.
- నల్లగొండ : కంచర్ల కృష్ణారెడ్డి గెలుపును కాంక్షిస్తూ నల్లగొండ పట్టణంలోని 33వ వార్డు తిరుమలనగర్, ఓల్డ్ వెంకటేశ్వర కాలనీల్లో మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో లెంకల వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, లక్ష్మయ్య, మధుసూదన్ రెడ్డి, చింతపల్లి రాజిరెడ్డి, నాంపల్లి గణేశ్, నాగార్జున, రమేశ్, యాదగిరి, మహేందర్ రెడ్డి, మహ్మద్ పర్వేజ్, వెంకటేశ్వర్లు, కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ : 33వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రావుల శ్రీనివాస్ రెడ్డి

చందంపేట : పోల్యానాయక్‌తండాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

అభ్యర్థుల ఖర్చుల వివరాలు మెయింటెయిన్ చేయాలి

- **అబ్జర్వర్ సాయన దెబర్మ**

నకిరేకల్ : ఏఆర్ఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అబ్జర్వర్ సాయన దెబర్మ

నకిరేకల్, మే 7 : పార్టీ అభ్యర్థుల ఖర్చుల వివరాలను మెయింటెయిన్ చేయాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఐఆర్ఎస్, ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్ సాయన దెబర్మ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. నకిరేకల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఏఆర్ఓ కార్యాలయంలో ఎక్స్‌పెండీచర్ టీం, అకౌంటింగ్ టీం, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, సీజీఎస్‌టీ, ఎస్‌సీఎస్‌టీ, ఇన్‌కంటాక్స్, ఫారెస్ట్, ఎక్సైజ్, పోలీస్, బ్యాంకింగ్, ఏడీఎం, ఐసీడీఎస్, ఎంవీఐ టీం సభ్యులతో రోజువారీ నివేదికలపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి. పూర్ణచంద్ర, తాసీల్దార్ ఎస్‌కే. జమీరొద్దీన్, డీఎస్పీ సైదా, ఎన్నికల డీటీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాలెట్ పోలింగ్ సరళి పరిశీలన

బ్యాలెట్ పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరాములు

చందంపేట(దేవరకొండ), మే 7 : దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగుల బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను ఆర్డీఓ శ్రీరాములు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట చందంపేట తాసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తాసీల్దార్లు అయూబ్, ముబీన్, అర్షద్, ఆర్ఐ నజీర్, అనిల్ తదితరులున్నారు.

కొండమల్లేపల్లిలో పోలీసుల కవాతు

కొండమల్లేపల్లి: కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు

కొండమల్లేపల్లి, మే 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోఐఆర్‌బీఎస్(కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు ప్రధాన రహదారుల గుండా ఫ్లాగ్ మార్చ్(కవాతు) నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ధనుంజయ గౌడ్ మా ట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగి ంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంమ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో రాజస్థాన్ కార్మికుడి ఆత్మహత్య

రాకేశ్ కుమార్(ఫైల్)

కొండమల్లేపల్లి, మే 7: మండల కేంద్రంలో మంగళవారం ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాంమ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌లోని బాట్వా గ్రామానికి చెందిన సోహన్లాల్‌కు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు ప్రజాపతి రాకేశ్(24) రెండేండ్లుగా కొండమల్లేపల్లిలోకి కిరాక్ రెడిమేడ్ దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం సొంత ఊరుకు వెళ్లి సోమవారం రాత్రి వచ్చాడు. ఈక్రమంలో మంగళవారం దుకానం యజమాని కిరణ్ బంధువు ఒకరు చనిపోవడంతో వారి అంత్యక్రియలకు వెళ్తూ దుకాణం తాళం ఇచ్చి వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం యజమాని కిరణ్ వచ్చి చూడగా రాకేశ్ దుకాణంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ రాంమ్మూర్తి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడికి రెండేండ్ల క్రితమే కూకట్‌పల్లిలో ఓ యువతితో వివాహం జరిగింది.కలహాలతో రెండు నెలలకే విడిపోయారు. దీంతో రాకేశ్ తాగుడుకు బానిసై మానసిక స్థితి బాగులేక కలత చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్రపర్చారు. మృతుడి బాబాయి సంపత్ చంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండలో భారీ వర్షం

నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో కురుస్తున్న వర్షం

నల్లగొండ పట్టణంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో ప్రజలకు తీవ్రమైన ఎండల నుంచి ఉపశమనం లభించినట్లయింది. నిర్విరామంగా కురిసిన వానలతో జిల్లా తడిసి ముద్దయింది.

కట్టంగూర్‌లో ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

త్రిపురారం మండలం బెజ్జికల్ ఈదురుగాలులకు విరిగిన స్తంభం

పోస్టల్ బ్యాలెట్ ఓటు గడువు పెంచాలి : దశరథనాయక్

మిర్యాలగూడ, మే 7: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఓటు వేసేందుకు గడువు తేదీ ఈనెల 8వరకు ఇచ్చారని, గడువు తేదీని ఈనెల 10 వరకు పొడిగించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ కోరారు. మంగళవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ 8వ తేదీన ఉద్యోగులకు మూడో విడుత ఎన్నికల శిక్షణ ఉన్నందున శిక్షణకు వెళ్లే ఉద్యోగులు ఓటు వేసే అవకాశం కోల్పోతారని అన్నారు. మరోవైపు ఉద్యోగుల నివాస ప్రాంతం ఒక చోటు ఓటు మరోచోటు ఉండడంతో ఇంక ఓటు ఎక్కడ వేయాలో తెలియక అనేక మంది ఓటు వేయలేదన్నారు. ఈనెల 10 వరకు గడువు పెంచాలని లేనట్లయితే అనేక మంది ఉద్యోగులు ఓటు హక్కును కోల్పోతారని అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఎమర్జెన్సీ లైట్లు ఉండేలా చర్యలు : ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

ఎమర్జెన్సీ లైట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు.

మిర్యాలగూడ, మే 7: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలతోపాటు ఎమర్జెన్సీ లైట్లను కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ, ఆర్ఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎండీయూసుఫ్ పట్టణంలోని 89 పోలింగ్ కేంద్రాల కోసం తీసుకొచ్చిన ఎమర్జెన్సీ లైట్లను పరిశీలించిన అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ పోలింగ్ సమయంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ఎమర్జెన్సీ లైట్లను వాడుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, లైటింగ్, ఫ్యాన్, తాగునీరు, పారిశుధ్యం కల్పించాలన్నారు. ఈనెల 8న పీఓలు, ఏపీఓలకు ఆఖరి విడుత శిక్షణ కేఎన్ఎం కళాశాలలో ఉంటుందన్నారు. హోంఓటింగ్‌లో ఇంకా 32 మంది ఓటర్లు ఉన్నారని, వారికి ఈనెల 8న ఓటింగ్ ఉంటుందన్నారు. ఆయన వెంట తాసీల్దార్లు హరిబాబు, జవహర్, సురేశ్, మున్సిపల్ ఇంజినీర్ వెంకన్న ఉన్నారు.